జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం





## భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | 14 | జులై | 2026 ◆ పేజీలు : 5


## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

- పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



**టేకులపల్లి, జూలై 13, ప్రజాజ్యోతి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని వేగవంతంగా అమలు చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం టేకులపల్లి మండల ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై ఆయన అధికారులతో విస్తృతంగా చర్చించారు.ఎంపీడీఓ శ్రీదేవి, హౌసింగ్ ఏఈ గణేష్ తో

మిగతా 2 లో...

- సింగరేణి డైరెక్టర్ (పా)పై వెల్లువెత్తుతున్న విమర్శలు
- 13 నెలల్లో కనీసం పన్నెండు రోజులు కూడా ప్రధాన కార్యాలయంలో కనిపించని సారూ
- కొత్తగూడెం కార్పొరేట్ కు రావడానికే ముఖం చాటేస్తున్న తీరు
- హైదరాబాద్ సింగరేణి భవన్ కే పరిమితమవుతున్న విధుల నిర్వహణ
- సుదూర ప్రాంతాల నుంచి వచ్చే కార్మికులు తమ బాధలు చెప్పకునేదెట్లా..?
- సింగరేణి చరిత్రలో ఎప్పుడూ లేని విధానమిదేనంటున్న ఉద్యోగ వర్గాలు..!




## కొత్తగూడెం కార్పొరేట్‌కు..

2 లో..

# ఎప్పుడొస్తారు సారు..?

సింగరేణి కాలరీస్ సంస్థలో సీఅండ్ఎండీ తర్వాత కీలకమైన పోస్ట్ డైరెక్టర్ పా(పీఏడబ్ల్యూ)..! పా అంటే.. పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్, వెల్ఫేర్. బొగ్గు గని కార్మికుల బాధలు, బాగోగులు అన్ని చూడాల్సిన అధికారి ఈయన. అలాంటి అధికారి సంస్థలో బాధ్యతలు చేపట్టి పదమూడు నెలలు గడుస్తున్నప్పటికీ పన్నెండు రోజులు కూడా ఆఫీస్ లో కాలు మోపలేదంటే ఏమనుకోవాలి..? సంస్థ ప్రధాన కార్యాలయంలో ఉండాల్సిన సారూ.. హైదరాబాద్ లోని సింగరేణి భవన్ కేంద్రంగానే కార్యకలాపాలు వెలగబెడుతూ కొత్తగూడెం రావడానికి ముఖం చాటేస్తే ఇంకేం చేయాలి..? ఎక్కడో వందల కిలోమీటర్ల దూరం నుండి తమ వెతలు, బాధలు చెప్పుకోవాలని భావించే బాధిత సింగరేణి కార్మికులు వారి గోడు ఎవరికి విన్నవించుకోవాలి..? సింగరేణి చరిత్రలోనే ఎక్కడా ఎప్పుడూ లేని విధంగా కొత్త సంప్రదాయానికి తెర తీసిన ఈ డైరెక్టర్(పా) విషయంలో వెల్లువెత్తుతున్న విమర్శలు, వివిధ అభిప్రాయాలే నేటి ప్రజాజ్యోతి ప్రత్యేక కథనంలో... ● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

## పోక్సో కేసుపై అనుమానాల ముసురు..!




- టూ టౌన్ పరిధిలో నమోదైన పోక్సో కేసుపై పలు అనుమానాలు
- ఆరుగురు ఉన్నారనే ప్రచారం.. కేసులో మాత్రం కొందరే..?
- ఎవరినైనా కేసు నుంచి తప్పించారా..? అన్న చర్చ
- పోలీసుల అధికారిక వివరణ కోసం ఎదురుచూపు..
- బాధిత కుటుంబానికి న్యాయంకోసం .. అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలన్న డిమాండ్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జులై 13, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల నమోదైన పోక్సో కేసు పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ కేసులో వాస్తవానికి మరికొందరు వ్యక్తులు ఉన్నప్పటికీ, వారిలో కొందరిని కేసు నుంచి తప్పించారనే ప్రచారం స్థానికంగా జరుగుతోంది. దీంతో కేసు దర్యాప్తు పారదర్శకతపై ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. బాధిత బాలిక కుటుంబ సభ్యుల

2 లో...

## ఇసుక మాఫియా జోరు...

# నిబంధనలు బేజారు

- అంతా అధికారుల కనసన్నల్లోనే....
- చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న రెవిన్యూ,రక్షణ వ్యవస్థలు ...



**బూర్గంపహాడ్, జూలై 13, (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలంలోని సోంపల్లి, బుడ్డుగూడెం ఇసుక ర్యాంపులలో అక్రమాల పర్వం అలుముకుంది. యథేచ్ఛగా సాగుతున్న ఇసుక దందాపై మండలవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి, అధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఆసరాగా చేసుకుని

మిగతా 2 లో...

## బీజేపీ సభలో సీపీఐ మేయర్..!

- కొత్తగూడెంలో రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసిన వేదిక
- సింగరేణి భరోసా యాత్ర సభలో మేయర్ మూడ్ గణేష్ హాజరు



కొత్తగూడెంలో బీజేపీ నిర్వహించిన 'సింగరేణి భరోసా యాత్ర' సభా వేదికపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులతో పాటు కనిపించిన కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జులై 13, ప్రజాజ్యోతి :** సింగరేణి భరోసా యాత్ర పేరుతో భారతీయ జనతా పార్టీ కొత్తగూడెంలో నిర్వహించిన సభ రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఈ సభలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కు చెందిన సీపీఐ పార్టీ మేయర్ మూడ్ గణేష్ వేదికపై కనిపించడం స్థానిక రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. ఈ కార్యక్రమానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సహా పలువురు పార్టీ ముఖ్య నాయకులు సభలో పాల్గొన్నారు. అయితే బీజేపీ నిర్వహించిన సభలో సీపీఐకి చెందిన మేయర్ వేదికపై ఉండడం

మిగతా 2 లో...

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



(మొదటి పేజీ తరువాయి...)

కలిసి ఇప్పటివరకు మంజూరైన ఇళ్ల సంఖ్య, ప్రారంభమైన నిర్మాణాలు, ఇంకా ప్రారంభం కాని ఇళ్లకు గల కారణాలు, నిర్మాణ దశలో ఉన్న ఇళ్ల పురోగతిని ఎమ్మెల్యే సమీక్షించారు. నిర్మాణం ప్రారంభం కాని ఇళ్ల పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే ప్రారంభమైన ఇళ్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం విజయవంతమైన అమలుకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సహాయం, మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. లబ్ధిదారులు కూడా అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

## బీజేపీ సభలో సీపీఐ మేయర్..!

(మొదటి పేజీ తరువాయి...)

రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. సాధారణంగా భారతీయ జనతా పార్టీ, కమ్యూనిస్టు పార్టీల మధ్య సిద్ధాంతపరమైన విభేదాలు బహిరంగంగానే ఉంటాయి. జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకునే ఈ రెండు పార్టీలకు చెందిన నేతలు ఒకే రాజకీయ వేదికను పంచుకోవడం అరుదుగా కనిపిస్తుంది. అలాంటి పరిస్థితుల్లో కొత్తగూడెంలో జరిగిన బీజేపీ సభలో సీపీఐ మేయర్ హాజరు కావడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. మేయర్ హోదాలో ప్రభుత్వ కార్యక్రమంగా హాజరయ్యారా? లేక వ్యక్తిగత ఆహ్వానం మేరకు సభలో పాల్గొన్నారా? అనే అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. దీనిపై సీపీఐ వర్గాలు, బీజేపీ నాయకత్వం ఎలాంటి వివరణ ఇస్తాయో చూడాల్సి ఉంది. ఈ ఘటనపై స్థానిక రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుండగా, రానున్న రోజుల్లో ఇది ఎలాంటి రాజకీయ చర్చకు దారితీస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

## పోక్సో కేసుపై అనుమానాల ముసురు..!

(మొదటి పేజీ తరువాయి...)

ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. అయితే ఘటనలో మొత్తం ఆరుగురు యువకులు ఉన్నారని, వారిలో ముగ్గురిపై మాత్రమే కేసు నమోదు చేసి, మిగిలిన వారిని కేసులో చేర్చలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో వాస్తవం ఏమిటన్న దానిపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. ఈ వ్యవహారంలో స్థానికంగా కొందరు రాజకీయ నాయకులు, మరి కొందరు ప్రభావశీలులు జోక్యం చేసుకున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. అయితే ఈ ప్రచారాలు, ఆరోపణలపై ఇప్పటివరకు పోలీసులు ఎలాంటి అధికారిక నిర్ధారణ చేయలేదు. దర్యాప్తు పూర్తయిన తర్వాతే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఇక కేసులో నిందితులుగా పేర్లు వినిపిస్తున్న యువకుల కుటుంబ సభ్యులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "ఘటనలో మరికొందరు ఉన్నారని చెబుతుంటే, మా పిల్లలపైనే ఎందుకు కేసు నమోదు చేశారు? అందరిపై ఒకే విధంగా చర్యలు ఎందుకు తీసుకోలేదు?" అని వారు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. మరోవైపు, బాధిత కుటుంబానికి న్యాయం జరగాలంటే ఘటనలో పాత్ర ఉన్న ప్రతి ఒక్కరిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికంగా డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై స్పందన కోరగా, సంబంధిత అధికారులు ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని, కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో నిర్వహించే అధికారిక మీడియా సమావేశంలో వెల్లడిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో ఘటనలో వాస్తవానికి ఎంతమంది పాత్ర ఉంది? కేసు నమోదు ప్రక్రియలో ఎలాంటి ప్రమాణాలు అనుసరించారు? ప్రచారంలో ఉన్నట్లుగా ఎవరైనా కేసు నుంచి మినహాయించారా? లేక ఇవన్నీ కేవలం ప్రచారమేనా? అనే ప్రశ్నలకు పోలీసుల అధికారిక వివరణతోనే సమాధానం లభించనుంది. ప్రస్తుతం ఈ కేసు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దర్యాప్తుపై వ్యక్తమవుతున్న అనుమానాలకు తెరదించాలంటే పోలీసులు సమగ్ర వివరాలను అధికారికంగా వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. దీంతో దర్యాప్తు ఏ దిశగా సాగుతుంది? ప్రచారంలో ఉన్న అంశాలపై పోలీసుల వివరణ ఏమిటి? అన్నది ఆసక్తికరంగా మారింది.

# కొత్తగూడెం కార్పొరేట్‌కు ఎప్పుడొస్తారు సారు..?

♦ **సింగరేణి డైరెక్టర్ (పా)పై వెల్లువెత్తుతున్న విమర్శలు..**

దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థల్లో ఒకటైన సింగరేణికి డైరెక్టర్ (పా)గా పనిచేయడం అత్యంత బాధ్యతాయుతమైన పదవి. ఈ స్థానంలో ఉండే అధికారి మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలని గత కొన్నేళ్లుగా సంస్థలో ఉన్న సంస్కృతిని మార్చి తిరిగి ఐఏఎస్ అధికారిని నియమించారు. సంస్థలోని వేలాది మంది కార్మికులు, ఉద్యోగుల సంక్షేమం, పరిపాలన, వివిధ ఏరియాలు, కార్పొరేట్ కార్యాలయాల మధ్య సమన్వయం వంటి కీలక బాధ్యతలు ఈ పదవికి ఉంటాయి. దీంతో సాధారణంగా డైరెక్టర్ (పా) కొత్తగూడెం ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో పర్యటించి కార్మికుల సమస్యలను తెలుసుకుంటారు. అయితే దాదాపు ఏడాది క్రితం బాధ్యతలు చేపట్టిన ప్రస్తుత డైరెక్టర్ (పా) తనకు కేటాయించిన చాంబర్ లో నెల రోజులైనా పూర్తిస్థాయిలో విధులు నిర్వహించలేదనే విమర్శలు కార్మికులు, కార్మిక సంఘాల నుంచి వినిపిస్తున్నాయి. హైదరాబాద్ లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న కార్యాలయానికే పరిమితమై విధులు నిర్వహించడం, కొత్తగూడెం ప్రధాన కార్యాలయానికి దూరంగా ఉండడం వల్ల కార్మిక సంక్షేమంపై ప్రత్యేక దృష్టి లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల పశ్చిమ బెంగాల్ ఎన్నికల పర్యవేక్షకుడిగా దాదాపు నెలన్నరపాటు విధులు నిర్వహించిన కాలాన్ని మినహాయిస్తే, మిగతా కాలమంతా హైదరాబాద్ కే పరిమితమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. "కార్మికులంటే, కార్మిక సంక్షేమమంటే అంత చిన్నచూపా?" అని ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి.

♦ **సుదూర ప్రాంతాల నుంచి వచ్చే కార్మికుల కష్టాలు వినేవారేరీ..?**

సింగరేణి పరిధిలోని వివిధ ఏరియాల నుంచి ప్రతిరోజూ పలువురు కార్మికులు, వారి కుటుంబ సభ్యులు తమ సమస్యలు, వినతులు చెప్పుకునేందుకు కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయానికి వస్తుంటారు. విధుల నిర్వహణలో భాగంగా వారి సమస్యలు విని పరిష్కార మార్గం చూపాల్సిన బాధ్యత సంబంధిత అధికారిపై ఉంటుంది. అయితే గత ఏడాది కాలంగా డైరెక్టర్ (పా) ప్రధాన కార్యాలయానికి అందుబాటులో లేకపోవడంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రెండు నెలలకొకసారి నిర్వహించే 'గ్రీవెన్స్ డే' ద్వారా ఉద్యోగులు, కార్మికులు తమ సమస్యలను నేరుగా చెప్పుకునే అవకాశం ఉండేది. అయితే దాదాపు ఏడాది కాలంగా ఆ వ్యవస్థ కూడా నిర్వీర్యమైందని, ఫలితంగా బొగ్గుబాయిల వద్ద ఎదురవుతున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం లేకుండా పోయిందని కార్మికులు వాపోతున్నారు.

♦ **కొత్త సంప్రదాయానికి తెరలేపిన డైరెక్టర్ (పా)**

సింగరేణిలో గతంలో డైరెక్టర్ (పా)గా పనిచేసిన అధికారులు ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహించడంతో పాటు అన్ని ఏరియాలను పర్యటిస్తూ కార్మికుల సమస్యలను తెలుసుకునే సంప్రదాయం కొనసాగేది. అయితే ప్రస్తుత అధికారి మాత్రం హైదరాబాద్ కే పరిమితమై, అప్పుడప్పుడు మాత్రమే కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయానికి వచ్చి వెళ్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కార్మికులు, కార్మిక సంఘాల నాయకులకు డైరెక్టర్ (పా) అందుబాటులో లేకపోవడంతో అనేక సమస్యలు పెండింగ్ లోనే ఉంటున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధాన కార్యాలయంలో పరిశీలించాల్సిన కీలక ఫైళ్లను కూడా నేరుగా హైదరాబాద్ కు తెప్పించుకుని అక్కడే ఆమోదిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సంస్థ డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో నేరుగా సమావేశమై సంస్థకు సంబంధించిన అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే పరిపాలనా విధానానికి భిన్నంగా ప్రస్తుతం వ్యవహారం సాగుతోందని ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి. సింగరేణి చరిత్రలో ఎప్పుడూ లేని కొత్త విధానానికి తెరలేపారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ఫైనాన్స్ అదనపు బాధ్యతలే కారణమా..?

సింగరేణి సీఎండీగా బాధ్యతలు నిర్వహించిన ఎన్. బలరాం డిప్యుటేషన్ ముగియడంతో తన పేరెంట్ క్యాడర్ కు తిరిగి వెళ్లిన అనంతరం, డైరెక్టర్ (ఫైనాన్స్) పదవి ఖాళీగా మారింది. దీంతో ఇప్పటికే డైరెక్టర్ (పా)గా బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారికే డైరెక్టర్ (ఫైనాన్స్) అదనపు బాధ్యతలను సంస్థ యాజమాన్యం అప్పగించింది. దీంతో హైదరాబాద్ లోనే ఎక్కువ సమయం విధులు నిర్వహించడంపై ప్రశ్నలు ఎదురైన ప్రతిసారీ, ఫైనాన్స్ బాధ్యతలు కూడా తన వద్దే ఉండటంతో అక్కడే అందుబాటులో ఉండాల్సి వస్తోందనే కారణాన్ని చూపుతున్నట్లు సంస్థ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వాదనను కార్మిక సంఘాలు, ఉద్యోగ వర్గాలు అంగీకరించడం లేదు. డైరెక్టర్ (ఫైనాన్స్)గా అదనపు బాధ్యతలు ఉన్నప్పటికీ, డైరెక్టర్ (పా)గా కార్మిక సంక్షేమం, పరిపాలనకు సంబంధించిన బాధ్యతలను ప్రత్యక్షంగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉన్నందున ప్రధాన కార్యాలయమైన కొత్తగూడెంలోనే ఎక్కువ సమయం అందుబాటులో ఉండాలని వారు అభిప్రాయపడుతున్నారు. ఫైనాన్స్ అదనపు బాధ్యతలను కారణంగా చూపుతూ ప్రధాన కార్యాలయానికి దూరంగా ఉండడం సమర్థనీయం కాదని పేర్కొంటున్నారు. దీంతో హైదరాబాద్ కే పరిమితమవుతున్న విధులకు నిజంగానే ఫైనాన్స్ అదనపు బాధ్యతలే కారణమా..? లేక మరేదైనా కారణం ఉందా..? అన్న చర్చ ప్రస్తుతం సింగరేణి వర్గాల్లో జోరుగా సాగుతోంది.

## ఇసుక మాఫియా జోరు... నిబంధనలు బేజారు...

(మొదటి పేజీ తరువాయి...)

అక్రమార్కులు సాగిస్తున్న దోపిడీపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో అక్రమ ఇసుక రవాణాకు సంబంధించి కొంతమంది వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రచురించినప్పటికీ అక్రమార్కులు మాత్రం అంతా అధికారులకు తాయిలాలు అందుతున్నట్లు వారి కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు ప్రవర్తించడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా అధికార పార్టీలో ఉన్న కొంతమంది తమ రాజకీయ పలుకుబడి, మంత్రుల పేరుతో ఈ దందా కొనసాగిస్తున్నట్లు మండల వ్యాప్తంగా ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు.

♦ **'జీరో' దందాతో ప్రభుత్వ ఖజానాకు గండి**

ఇసుక ర్యాంపుల్లో నిబంధనలకు విరుద్ధంగా 'జీరో' దందా నడుపుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా ప్రభుత్వ అనుమతులు, నిబంధనలకు ఏమాత్రం సంబంధం లేకుండా ఇష్టానుసారంగా వాహనాల్లో ఇసుక రవాణా చేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. పాలకుల అండదండలు ఉన్నాయన్న ధీమాతోనే ఈ అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

♦ **భారీ యంత్రాల వినియోగంపై మౌనం**

నిబంధనల ప్రకారం ఇసుకను చేతులతో లేదా పరిమితంగా మాత్రమే తీయాల్సి ఉండగా, ర్యాంపుల్లో భారీ యంత్రాలను (జేసీబీ) ఏర్పాటు చేసి ఇసుక లోడింగ్ నిర్వహిస్తున్నారు. దీనివల్ల నదీ గర్భం దెబ్బతినడంతో పాటు పర్యావరణానికి కూడా తీవ్ర ముప్పు వాటిల్లుతోంది. యంత్రాల వినియోగంపై ఆంక్షలు ఉన్నప్పటికీ, వాటిని పట్టించుకోకుండా అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. బాధ్యతాయుతమైన అధికారులు మాత్రం ఈ అక్రమాలపై అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తనిఖీలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## బద్దుతండ ఆటో అడ్డా కమిటీ ఎన్నిక





**టేకులపల్లి, జూలై 13, ప్రజాజ్యోతి:** తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయూ) ఆధ్వర్యంలో బద్దుతండ ఆటో అడ్డా కమిటీ ఎన్నికలు నిర్వహించినట్లు ఐఎఫ్టీయూ రాష్ట్ర నాయకులు డి. ప్రసాద్ తెలిపారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా బానోతు లక్ష్మణ్, కార్యదర్శిగా బోడా మోహన్‌తో పాటు మరో ఐదుగురు సభ్యులతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా డి. ప్రసాద్ మాట్లాడుతూ నూతన కమిటీ ఆటో కార్మికుల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఆటో కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని కోరారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు సంవత్సరానికి రూ.12 వేల నిరుద్యోగ భృతిని తక్షణమే అమలు చేసి చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# గురుకులాల్లో అవినీతిపై విచారణ వేగవంతం చేయాలి

- ఆర్‌సీఓను సస్పెండ్ చేయాలని కలెక్టర్‌కు నంగారా భేరి వినతి



**కొత్తగూడెం, జూలై 13, ప్రజా జ్యోతి:** లంబాడ హక్కుల పోరాట సమితి (నంగారా భేరి) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి గురుకుల విద్యా వ్యవస్థలో జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, భద్రాచలం ప్రాంతీయ సమన్వయ అధికారి (ఆర్‌సీఓ) పర్యవేక్షణలో పం వల్ల ఇటీవల కిన్నెరసాని గిరిజన గురుకులం నుంచి ఇద్దరు విద్యార్థులు కనిపించకుండా పోయిన ఘటన చోటుచేసుకుందని ఆరోపించారు. అలాగే పై అధికారుల అనుమతి లేకుండానే నియామకాలు, బదిలీలు, డిప్యూటేషన్లు చేపడుతున్నారని, ఇందుకు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. గత నాలుగు నెలలుగా ఆర్‌సీఓపై అవినీతి ఆరోపణలతో తమ సంఘం పోరాటం చేస్తోందని తెలిపారు. పేద గిరిజన విద్యార్థులకు కేటాయించాల్సిన సీట్లను రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు విక్రయిస్తున్నారనే ఆరోపణలను కూడా వారు చేశారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర గిరిజన సంక్షేమ ప్రధాన అధికారికి ఫిర్యాదు చేయడంతో విచారణ కమిటీని ఏర్పాటు చేసి, విచారణ అధికారిగా ఐటీడీఏ పీవో రాహుల్‌ను నియమించారని తెలిపారు. అయితే ఉత్తర్వులు జారీ అయి పది రోజులు గడిచినా ఇప్పటివరకు విచారణ ప్రారంభం కాలేదని ఆరోపించారు. దీనిపై అనుమానాలు వ్యక్తం చేసిన సంఘం నాయకులు, వెంటనే సమగ్ర విచారణ చేపట్టి అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తున్న ఆర్‌సీఓపై చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో నంగారా భేరి జిల్లా అధ్యక్షుడు భూక్య లాలు నాయక్, టేకులపల్లి మండల అధ్యక్షుడు మూడ్ హుస్సేన్ నాయక్, జిల్లా నాయకులు వెంకన్న నాయక్, రాములు నాయక్, బద్రు నాయక్, రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## టేకులపల్లి నూతన ఎస్ఐకి ఇల్లందు డివిజన్ టిప్పర్ అసోసియేషన్ మర్యాదపూర్వక సన్మానం



**టేకులపల్లి, జూలై 13, ప్రజాజ్యోతి** టేకులపల్లి పోలీస్ స్టేషన్ నూతన సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ)గా బాధ్యతలు స్వీకరించిన కె. తిరుపతిని ఇల్లందు డివిజన్ టిప్పర్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇల్లందు డివిజన్ టిప్పర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. నరసింహారావు, ఉపాధ్యక్షుడు బోడ మంగీలాల్ నాయక్, కార్యదర్శి ఎ. వెంకటేష్ నూతన ఎస్ఐకి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని కోరుతూ, పోలీసు శాఖకు టిప్పర్ అసోసియేషన్ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని అసోసియేషన్ నాయకులు తెలిపారు.

## గడ్డి ఇంటి నుంచి పాఠశాల గదికి

- అంగన్‌వాడీ కేంద్రానికి స్కూల్ గది కేటాయింపు
- చిన్నారుల కోసం ట్రైనీ కలెక్టర్ ప్రత్యేక చొరవ





**చర్ల, జూలై 13: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని రాళ్లాపురం గ్రామంలో గడ్డి ఇంటిలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ట్రైనీ కలెక్టర్ ఎం. మురళి సూచనల మేరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనంలోని గదికి సోమవారం తరలించారు. చిన్నారులకు సురక్షితమైన, అనుకూలమైన వాతావరణంలో సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ చర్య చేపట్టారు. ఈ మార్పు ప్రక్రియను సమగ్ర శిశు అభివృద్ధి సేవల (ఐసీడీఎస్) బాలల అభివృద్ధి ప్రాజెక్టు అధికారి (సీడీపీవో) రేవతి స్వయంగా పరిశీలించి అధికారుల సమక్షంలో పూర్తి చేయించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వెంకటరమణ, అంగన్‌వాడీ సూపర్వైజర్, అంగన్‌వాడీ టీచర్ త్రివేణి, మడకం లక్ష్మి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అదే సందర్భంగా ట్రైనీ కలెక్టర్ సూచనలతో ఖమ్మానికి చెందిన వీబీపీ పోలీస్ అకాడమీ ప్రతినిధులు అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు 25 పలకలు, బలపాలు అందజేశారు. ఈ విద్యా సామగ్రి చిన్నారుల ప్రారంభ విద్యకు ఉపయోగపడుతుందని వారు తెలిపారు. గడ్డి ఇంటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాన్ని పాఠశాల భవనంలోని గదికి తరలించడంతో చిన్నారులకు మెరుగైన వసతులు లభిస్తాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంపై ట్రైనీ కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## నులిపురుగుల నివారణ మందుల పంపిణీ



**చర్ల, జూలై 13(ప్రజా జ్యోతి ):** చర్ల మండల కేంద్రంలోని గురుదేవ్ విద్యాలయంలో సోమవారం జాతీయ బాలల ఆరోగ్య కార్యక్రమం (ఆర్ బీఎస్ కే) బృందం ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేసి వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ బీఎస్ కే వైద్యులు డాక్టర్ సందీప్, డాక్టర్ స్ఫూర్తి, ఏఎన్ ఎం ఎం. సరస్వతి, ఆశా కార్యకర్తలు పి. చంద్రకళ, జి. విజయలక్ష్మి పాల్గొని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సందీప్ మాట్లాడుతూ నులిపురుగుల కారణంగా చిన్నారుల్లో రక్తహీనత, బరువు తగ్గడం, పోషకాహార లోపం, శారీరక ఎదుగుదల మందగించడం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రతి చిన్నారి తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మందులు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రత పాటించడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం ద్వారా నులిపురుగుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెచ్.జీ.వి. ప్రసాద్, అకడమిక్ సమన్వయకర్తలు ఎం.వి. సుబ్రహ్మణ్యం, జి. శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీ





**చర్ల, జూలై 13(ప్రజా జ్యోతి ):** చర్ల మండలం రాళ్లాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) విద్యార్థులకు ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం. మురళి ప్రత్యేక చొరవతో వీబీపీ పోలీస్ అకాడమీ సహకారంతో సోమవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తిని పెంపొందించి నాణ్యమైన విద్యకు ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, పలకలను అందజేశారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి పి.వి. రమణ, వీబీపీ పోలీస్ అకాడమీ చైర్మన్ పి.వి. అశోక్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు విద్యా సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు అవసరమైన విద్యా వనరులు అందుబాటులోకి రావడం వారి భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుందని అన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదువుకొని క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. సమాజ సేవలో భాగంగా విద్యా రంగానికి తోడ్పాటునందిస్తున్న వీబీపీ పోలీస్ అకాడమీ సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.డి. జబీనా బేగంను పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల నమోదు పెంపు, బోధన నాణ్యత మెరుగుదల, పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం కల్పించడంలో చూపిన అంకితభావానికి గుర్తింపుగా గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి పి.వి. రమణ, జెడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు టి. మంజుల, వీబీపీ పోలీస్ అకాడమీ చైర్మన్ పి.వి. అశోక్ కుమార్, న్యాయవాది పరిటాల సంతోష్ కుమార్, ఐసీడీఎస్ బాలల అభివృద్ధి ప్రాజెక్టు అధికారి (సీడీపీవో) శిరీష, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల ఆరోగ్యానికి నులిపురుగుల నివారణ అత్యంత కీలకం

- జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య





**టేకులపల్లి, జూలై 13, ప్రజాజ్యోతి:** చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో నులిపురుగుల నివారణకు అత్యంత ప్రాధాన్యత ఉందని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం టేకులపల్లి మండలంలోని కోయగూడెం ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా 1నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ మాత్రలు అందజేయడం ద్వారా నులిపురుగుల సమస్యను సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. ఈ మాత్రల వినియోగం వల్ల పిల్లల్లో పోషకాహార శోషణ మెరుగుపడటంతో పాటు ఆరోగ్యవంతమైన ఎదుగుదల, విద్యాభ్యాసంలో చురుకుదనం పెరుగుతుందని వివరించారు. పాఠశాలలు, కళాశాలలు, అంగన్ వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించేలా సహకరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోయగూడెం సర్పంచ్ కోరం సుభాష్ చంద్రబోస్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, అంగన్ వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## జర్నలిజాన్ని అవమాన పరిచిన ఎఫ్ఆర్ఓ

- ఎఫ్ ఆర్ ఓ, స్నేహలత



**పినపాక,జులై 13(ప్రజాజ్యోతి)**పోడుభూముల విషయంలో అటవీధికారులు, పోడుసాగుదారులమధ్య ఉద్రిక్తత జరుగుతుందన్న విషయం తెలుసుకుని ఘటనస్థలానికి చేరుకున్న పత్రికామిత్రులకు అటవీధికారులనుండి చుక్కెదురయింది. వివారాలలోకి వెళితే... పినపాక మండలం బోటిగూడెం ఫారెస్ట్ బీట్ పరిధిలో బందగిరినగరం పోడుసాగుదారులకు, అటవీ అధికారులకు మధ్య సోమవారం నాడు ఘర్షణ చోటుచేసుకుంది. విషయం తెలిసి అక్కడికి చేరుకున్న విలేకరుల పై అటవీ అధికారులు కోపోద్రే కులయ్యారు. జరుగుతున్న ఘర్షనను చిత్రీ కరిస్తున్న సమయంలో ఏడుల్లబయ్యారం అటవీ రేంజ్ అధికారిని స్నేహలత విలేకరులపై తన ప్రతాపాన్ని చూపించారు.అడవిలోకి మీకు ప్రవేశం లేదని, ఎవరి పర్మిషన్ తీసుకున్నారని ప్రశ్నించ్చారు. మేము ఫోటోలు పెడతాం మీరు వార్తలు రాసుకోండని ఎద్దేవా చేశారు. అటవీ చట్టాల ప్రకారం అడవిలోకి వస్తే కేసులుపెడతామని హెచ్చరించారు.

## వీవోఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- ఐకేపీ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన వీవో ఏల సంఘం
- ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్



**దమ్మపేట, జూలై 13(ప్రజాజ్యోతి):**గ్రామీణ పేదరిక నిర్మూలన లక్ష్యంగా మహిళా సంఘాలను బలోపేతం చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్న వీవోఏల (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు) సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సోమవారం దమ్మపేటలోని ఐకేపీ కార్యాలయంలో అకౌంటెంట్ భానుకు వీవోఏల సంఘం తరపున వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా పిట్టల అర్జున్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వీవోఏల సమస్యలను పరిష్కరించి నెలకు రూ.18 వేల వేతనం అందజేస్తామని హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. సెర్ప్ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం గ్రామ సంఘాల ద్వారా వేతనాలు పెంచాలని, ప్రతి గ్రామ సంఘానికి ట్యాబ్‌లు, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, రూ.10లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా అమలు చేయాలని, ప్రస్తుతం అమలులో ఉన్న ఆన్‌లైన్ పని విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు, వీవోఏల సంఘం మండల నాయకులు ధనలక్ష్మి, జ్యోతి, శ్రీలత, ధమయంతి, వెంకటమ్మ, పద్మ, రోజా, వరలక్ష్మి, సుశీల, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

## లారీని ఢీకొన్న బైక్.. అక్కడికక్కడే మృతి చెందిన యువకుడు

- ఇద్దరికి తీవ్ర గాయాలు.. డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ఆరోపణ

**దమ్మపేట, జూలై 13(ప్రజాజ్యోతి):**దమ్మపేట మండల పరిధిలో రహదారిపై ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా నిలిపి ఉంచిన లారీని మోటార్ సైకిల్ ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన విషాద ఘటన చోటుచేసుకుంది.పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు, జూలై 12వ తేదీ రాత్రి సుమారు 11 గంటల సమయంలో రహదారిపై ఎటువంటి హెచ్చరిక బోర్డులు, సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయకుండా లారీని నిలిపివేశారు. ఇదే సమయంలో దమ్మపేట మండలం,గంగులగూడెం గ్రామానికి చెందిన వంకా కిషోర్ తన మోటార్ సైకిల్ పై కూరం కార్తీక్, వంక శివలతో కలిసి సత్తుపల్లి వైపు వెళ్తుండగా, ముందున్న లారీని గమనించలేక బలంగా ఢీకొట్టాడు.ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వంక కిషోర్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న కూరం కార్తీక్, వంక శివలకు రక్తస్రావంతో కూడిన తీవ్ర గాయాలు కాగా, వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.మృతుడి భార్య భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పై దర్యాప్తు చేపట్టారు.

# మాస శివరాత్రి వేళ శివాలయంలో విశేష పూజలు

- మహాన్యాస రుద్రాభిషేకం, తిరుకళ్యాణం నిర్వహణ
- ప్రదోష వేళ నందీశ్వరుడు–మల్లికార్జున స్వామికి ప్రత్యేక అభిషేకాలు
- వందలాది మంది భక్తుల దర్శనం.. అన్నదానం, తీర్థప్రసాదాల పంపిణీ










**అన్నపురెడ్డిపల్లి, జూలై 13 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి దేవస్థానంలో మాస శివ రాత్రి, సోమవారం, ఆరుద్ర నక్షత్రం ఒకే రోజు కలిసివచ్చిన అరుదైన పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం విశేష పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ అరుదైన పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ చేసి భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించారు. శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తిరుకళ్యాణాన్ని తిలకించేందుకు ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. అనంతరం ధూపసేవ, నాగహారతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ప్రదోషకాలంలో నందీశ్వరుడు, మల్లికార్జున స్వామికి ఏకకాలంలో అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక హారతులు, పూజలు నిర్వహించారు. ప్రదోష పూజల్లో వందలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రోజంతా ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. భక్తులు తమ మొక్కులు చెల్లించి స్వామివారి ఆశీస్సులు పొందారు.మర్రిగూడెంకు చెందిన మిర్యాల కృష్ణ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఉపసర్పంచ్ మారగాని అశోక్, మాజీ సర్పంచ్ బోడా పద్మ, దోసపాటి శంకరరావు, కృష్ణయ్య, మల్లెల నరసింహారావు దంపతులు, శ్రేయస్ మీడియా అధినేత కుటుంబ సభ్యులు, వారి బృందం, శివభక్తులు, గ్రామ పెద్దలు విశేషంగా పాల్గొన్నారు. పరిసర గ్రామాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు. కార్యక్రమాల నిర్వహణలో ఆలయ మేనేజర్ పి.వి. రమణ అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. విశేష పూజలు, రుద్రాభిషేకం, తిరుకళ్యాణం, ప్రదోష ఆరాధన, అన్నదాన కార్యక్రమాలతో ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుని భక్తజనసందోహంతో కళకళలాడింది.

## మాస శివరాత్రి వేడుకల్లో పాల్గొన్న శ్రేయస్ వన్ సిటీ అధినేత రమ





**అన్నపురెడ్డిపల్లి, జూలై 13 (ప్రజా జ్యోతి):**అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి దేవస్థానంలో నిర్వహించిన మాస శివరాత్రి విశేష పూజల్లో శ్రేయస్ మీడియా అధినేత శ్రీనివాస్ రావు సోదరి, శ్రేయస్ వన్ సిటీ అధినేత రమ ప్రత్యేకంగా పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో మల్లెల నరసింహారావు దంపతులు కూడా పాల్గొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులను కలిసి ప్రత్యేక పూజల ఏర్పాట్లను అభినందించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహణ

- పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అల్బెండజోల్ మాత్రల పంపిణీ
- విద్యార్థులకు అవగాహన కల్పించిన వైద్య సిబ్బంది





**అన్నపురెడ్డిపల్లి, జూలై 13 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలకు వయస్సును బట్టి అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయుల సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. నులిపురుగుల నివారణ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత, నులిపురుగుల వల్ల వచ్చే ఇన్ఫెక్షన్ల నివారణకు ఈ మాత్రలు ఉపయోగపడతాయని వైద్యాధికారి డాక్టర్ మనోజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# ఇదేక్కడి తీరు!



- పురిటి గడ్డను మరిచిన కేంద్ర మంత్రివర్య?
- కానరాని ఇల్లందు ఏరియా!
- పూసపల్లి ఓసీ ప్రారం భంపై కొనసాగుతున్న సందిగ్ధత?
- కేంద్ర మంత్రి అనుకూ లమా?
- రాష్ట్ర ప్రభుత్వ ఆరా టమా!
- ఇల్లందు ఏరియాను కనుమరుగు చేసే ప్రయత్నాలా..?
- భవిష్యత్తుపై ఆందోళ నలో సింగరేణి కార్మి కులు!
- ఇల్లందు ఏరియా కొన సాగించాలని డిమాండ్?
- యాజమాన్యం స్పంద నపై ఉత్కంఠ!

ఇల్లందు, జులై 13 (ప్రజాజ్యోతి)ఒక ప్పుడు సింగరేణి కార్యకలాపాలకు కేంద్రబిందువుగా నిలిచిన ఇల్లందు ఏరియా భవిష్యత్తు నేడు ప్రశ్నా ర్థకంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సింగరేణి సంస్థలో తొలి బొగ్గు తవ్వకాల ప్రాంతంగా చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించిన ఇల్లందుకు ఇటీవల కాలంలో ఆశించిన స్థాయిలో ప్రాధాన్యం దక్కడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ››› పూసపల్లి ఓసీపై నీలినీడలు

ప్రస్తుతం ఇల్లందు ప్రాంత భవిష్యత్తుకు కీలకంగా భావిస్తున్న పూసపల్లి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు ప్రారంభం ఇప్పటికీ సందిగ్ధంలోనే ఉంది. ఎక్కువ స్థాయిలో అనుమతులు, ప్రక్రియలు పూర్తయినా ప్రాజెక్టు ప్రారంభంపై స్పష్టత లేకపోవడం కార్మికుల్లో తీవ్ర నిరాశకు కారణమవుతుంది.

### ››› కేంద్ర మంత్రి మౌనమేనా?

రాష్ట్రానికి చెందిన సికింద్రాబాద్ పార్లమెంటు స్థానం నుండి విజయం సాధించిన కిషన్ రెడ్డి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా రాష్ట్రంలో సింగరేణికి పుట్టినిల్లయిన ఇల్లందు సమస్యలపై ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పురిటి గడ్డ అభివృద్ధిపై ప్రత్యేక చొరవ ఎందుకు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు స్థానికంగా ఉత్పన్నమవుతున్నాయి.

### ››› రాష్ట్ర ప్రభుత్వానిదే ఆరాటమా?

ఇల్లందు ఏరియా కొనసాగింపుపై రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు సానుకూల సంకేతాలు ఇచ్చినప్పటికీ, ప్రాజెక్టుల అమలులో మాత్రం ఆశించిన పురోగతి కనిపించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లోపిస్తున్నదా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

### ››› కార్మికుల్లో ఆందోళన

కొత్త ప్రాజెక్టులు లేకపోవడం, ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతాయన్న భయం, భవిష్యత్తులో ఏరియా ఉనికిపైనే ప్రభావం పడుతుందన్న ఆందోళనతో కార్మికులు తీవ్ర నిరుత్సాహంలో ఉన్నారు. కొత్త తరానికి ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలు వెంటనే చేపట్టాలని వారు కోరుతున్నారు.

### ››› కొనసాగింపే లక్ష్యమా

చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఇల్లందు ఏరియాను బలోపేతం చేస్తూ కొత్త గనులు, కొత్త ప్రాజెక్టులు తీసుకురావాలని కార్మికులు, స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పూసపల్లి ఓసీని తక్షణమే ప్రారంభించి ఇల్లందు ఏరియా భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరుతున్నారు.

### ››› యాజమాన్యం ఎలా స్పందించేనోనన్న ఎదురుచూపులు?

సింగరేణికి పుట్టినిల్లయిన ఇల్లందు ఏరియా భవిష్యత్తుపై నెలకొన్న అనుమానాలకు తెరదించాలంటే సింగరేణి యాజమాన్యం స్పష్టమైన ప్రకటన చేయాలని కార్మికులు, ప్రజలు కోరుతున్నారు. రానున్న రోజుల్లో యాజమాన్యం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది.

# కృషితో నాస్తి దుర్భిక్షం

- యువ పారిశ్రామికవేత్త జర్పుల రాజ్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ





ఇల్లందు, జులై 13 (ప్రజా జ్యోతి )అతి చిన్న వయసులోనే క్లాస్–1 కాంట్రాక్టర్‌గా గుర్తింపు పొంది, సుమారు 40 కుటుంబాలకు ప్రత్యక్ష ఉపాధి కల్పిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్న యువ పారిశ్రామికవేత్త జర్పుల రాజ్‌కుమార్ జన్మదినం సందర్భంగా సోమవారం పలువురు ప్రముఖులు, మిత్రులు, శ్రేయోభిలాషులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. కష్టపడి ఎదగాలనే సంకల్పం, నాణ్యతతో కూడిన పనితీరు, సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్న రాజ్‌కుమార్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, సామాజిక బాధ్యతతో సమాజాభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్న ఆయన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. నిర్మాణ రంగంలో తన ప్రతిభను చాటుకుంటూ అతి చిన్న వయసులోనే క్లాస్–1 కాంట్రాక్టర్‌గా ఎదగడం, పలువురు యువకులకు ఉపాధి కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తూ సంస్థను మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సంజన మెడికల్స్, ఇల్లెందు తరపున ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, జర్పుల రాజ్‌కుమార్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో చిరకాలం ప్రజలకు సేవ చేస్తూ మరిన్ని విజయాలు, ఉన్నత స్థానాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ధారావత్ దేవీలాల్, వీరన్న, గుగులోత్, రమేష్, మాన్సింగ్, కిట్టి, అజ్మీర. వికాస్, వినాయక్ తదితరులు పాల్గొన్నారు.



# ఆళ్లపల్లిలో నూతన జీవవైవిధ్య యాజమాన్య కమిటీ ఏర్పాటు

- జీవవైవిధ్య పరిరక్షణకు గ్రామస్థుల సహకారం అవసరం సర్పంచ్ సుతారి రమాదేవి



**ఆళ్ళపల్లి,జూలై 13ప్రజా జ్యోతి** ఆళ్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో జీవవైవిధ్య పరిరక్షణ, స్థానిక జీవ వనరుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు నూతన జీవవైవిధ్య యాజమాన్య కమిటీ (బీఎంసీ)ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సుతారి రమాదేవి మాట్లాడుతూ గ్రామంలోని జీవవైవిధ్య సంపదను సంరక్షించడం, స్థానిక జీవ వనరుల వివరాలను నమోదు చేయడం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం, వృక్ష సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం వంటి బాధ్యతలను కమిటీ నిర్వహిస్తుందని తెలిపారు.కమిటీ చైర్‌పర్సన్‌గా సుతారి రమాదేవి, కార్యదర్శిగా వజ్జ రాధాకృష్ణ, మహిళా సభ్యులుగా పాయం సుశీల, దొడ్డి మమత, సభ్యులుగా కొమరం రామారావు, పదిగే సమ్మయ్య, అరెల్ల వేణు నియమితులయ్యారు. కమిటీ సభ్యులు గ్రామంలోని సహజ వనరులను పరిరక్షించడంతో పాటు పర్యావరణ హిత కార్యక్రమాలను చేపట్టి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సర్పంచ్ సూచించారు.జీవవైవిధ్య పరిరక్షణ అనేది ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి గ్రామస్థుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్న ఆమె, మొక్కల సంరక్షణ, నీటి వనరుల పరిరక్షణ, జీవజాల రక్షణలో ప్రజలందరూ పాల్గొని కమిటీకి సహకరించాలని కోరారు.

# మండల కూడలిలో అంబేద్కర్ విగ్రహం పునరుద్ధరణకు మంత్రి కిషన్ రెడ్డి ని కలిసిన దళిత సంఘ నాయకులు

- పునరుద్ధరణ కై సానుకూలంగా స్పందించిన మంత్రి కిషన్ రెడ్డి



**అశ్వాపురం, జులై 13, ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకి పర్యటించిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి, అంబేద్కర్ విగ్ర హం పునరుద్ధరణ విషయంపై దళిత సంఘాలు మంత్రిని కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల కాలంలో పినపాక నియోజకవర్గం అశ్వాపురం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆర్ అండ్ బి, జాతీయ రహదారుల అధికారులు తొలగించారని...రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని మరల అశ్వాపురం మండల కేంద్రంలో ఏర్పాటు చేసే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రివర్యులు జి కిషన్ రెడ్డి కి పూర్తి వివరాలతో కూడిన వినతి పత్రం అందజేయడం జరిగింది.. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తప్పకుండా వివరాలు తెలుసుకొని అంబేద్కర్ విగ్రహం పునరుద్ధరణ పై చర్యలు తీసుకుంటానని దళిత సంఘాల నాయకులకు హామీ ఇవ్వడం జరిగింది.. ఈ కార్యక్రమంలో మాల జన సమితి పినపాక నియోజకవర్గ అధ్యక్షులు చెట్టి సురేష్, ఎమ్మార్పీఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ఇసంపల్లి కృష్ణ, మాల మహానాడు జిల్లా సహాయ కార్యదర్శి మేకల భాస్కర్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు వల్లెపోగు వెంకటేశ్వర్లు, కొమ్ము హుస్సేన్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.